సాక్షి
నిజామాబాద్
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



లక్ష్య సాధన దిశగా..
విద్యార్థినులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధన దిశగా విద్యాభ్యాసాన్ని సాగించాలని న్యాయమూర్తి సునీత అన్నారు.
- 10లో ▸



లంచం ఇవ్వొద్దు..
ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే తమకు సమాచారం అందించాలని ఏసీబీ సూచిస్తోంది.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /13.6

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎస్కేప్ గేట్ల ద్వారా లీకేజీ నీరు నిలిపివేత

- వరద గేట్ల ద్వారా ఆగని లీకేజీ



సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ నుంచి ఎస్కేప్ గేట్లు, వరద గేట్ల ద్వారా నీరు లీకేజీ రూపంలో గోదావరిలోకి పోవడం పై మంగళవారం 'సాక్షి'లో 'ప్రాజెక్ట్ నీరు గంగపాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి జెన్‌కో అధికారులు స్పందించారు. తమ ఆధీనంలో ఉన్న ఎస్కేప్ గేట్ల ద్వారా చుక్క నీరు లీకేజీ కాకుండా మూసి వేయించారు. కాగా ప్రాజెక్ట్ అధికారుల ఆధీనంలో ఉన్న వరద గేట్ల నుంచి లీకేజీ నీరు మాత్రం యథాతథంగా గోదావరిలోకి వెళ్తోంది. ప్రాజెక్ట్ అధికారులు నిర్లక్ష్యంతో వరద గేట్ల ద్వారా లీకేజీ నీటిని అరికట్టలేదు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరి దుర్మరణం



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ గ్రామ శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. నిజామాబాద్ నగరానికి చెందిన కస్తూరి ప్రమోద్ (21), అంకడి సంజయ్(22) పల్సర్ బైక్ పై ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తుండగా మంగళవారం రాత్రి 8 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్‌ఎల్‌హెచ్‌పీ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

నిజామాబాద్ నాగారం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న ఎమ్‌ఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) పోస్టులకు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను అధికారులు చేపట్టారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో 13 పోస్టులకు గాను అర్హులైన 14 మంది ఎంబీబీఎస్ అభ్యర్థులను పిలువగా 10 మంది హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను పరిశీలించి ఎంపిక చేశారు. మిగతా మూడు పోస్టులకు ఆయూష్ కోర్సు పూర్తి చేసిన 14 మంది హాజరయ్యారు. ఇందులో ముగ్గురిని అధికారులు ఎంపిక చేశారు. ఎంబీబీఎస్ వైద్యులకు నెలకు రూ.43 వేలు, ఆయూష్ వైద్యులకు రూ. 37 వేల జీతం ఉంటుంది.

మున్సిపల్ ఆర్ఐపై ఈడీకి నివేదిక

ఖలీల్‌వాడి: మున్సిపల్ కార్పొరేషన్ ఆర్ఐ నరేందర్‌కు సంబంధించిన నివేదికను ఏసీబీ అధికారులు ఈడీకి అందించినట్లు సమాచారం. ఆగస్టు 9న ఏసీబీ అధికారులు నరేందర్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా రూ. 2.93 కోట్లు నగదు, బంగారం, పలు డ్యాకుమెంట్లు లభించాయి.

ప్రమాదంలో

అడవి జంతువు



జిల్లాలో వన్యప్రాణుల వివరాలు

చిరుతలు	25	ఎలుగుబంట్లు	32
అడవి కుక్కలు	35	అడవి పిలులు	25
జింకలు	295	నెమళ్లు	315
మనుబోతులు	368	నక్కలు	16
తోడేళ్లు	11	హైనాలు	04

- కనిపించని సంరక్షణ చర్యలు
- హైవే, రైలు పట్టాలపైనే ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాలు
- తరచూ మృత్యువాత పడుతున్న చిరుతలు, ఇతర జంతువులు
- నివారణ చర్యలు చేపట్టలేకపోతున్న అటవీ శాఖ అధికారులు
- అండర్‌పాస్ బ్రిడ్జిలు, అడవికి ఇరువైపులా ఫెన్సింగ్ వేయాలని హైవే ఆథారిటీకి అటవీ శాఖ లేఖలు

అటవీ శాఖ అడవుల రక్షణకే ప్రాధాన్యత ఇస్తూ.. జంతు సంరక్షణకు కనీస చర్యలు చేపట్టక పోవడంతో వాటి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వేటగాళ్ల ఉచ్చుకు కొన్ని బలవుతుండగా, అడవులను దాటే క్రమంలో రోడ్డు, రైలు ప్రమాదాల బారిన పడి మరికొన్ని మృత్యువాత పడుతున్నాయి. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వివిధ రకాల అటవీ జంతువుల మనుగడ తగ్గిపోతోంది.

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను కలుపుతూ అడవులు విస్తరించి ఉన్నాయి. ఇందల్వాయి రేంజ్‌కు సదాశివనగర్, సిరికొండ రేంజ్‌కు మాచారెడ్డి మండలాల అడవులు కలుపుకొని ఉంటాయి. వన్య ప్రాణులు ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటుగా అడవుల్లో సంచరిస్తాయి. అయితే అడవుల గుండా 44వ నంబరు జాతీయ రహదారితో పాటు రైల్వే ట్రాక్ ఉంది. వీటిని దాటే క్రమంలో వన్యప్రాణులు వాహనాలు, రైలు ప్రమాదాలకు గురై చనిపోతున్నాయి. గడిచిన కొన్నేళ్లలో రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వాటిల్లో అధికంగా చిరుతలే ఉండడం గమనార్హం. రోడ్లపై చిరుతలు, ఇతర జంతువులను చూసి వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వాటిని తప్పించబోయి వాహనదారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు.

పరిష్కార మార్గాలున్నప్పటికీ..

సాధారణంగా అటవీ జంతువులు ఆహారం కోసం లేదా నీటి కోసం రోడ్డును, రైలు పట్టాలను దాటి వెళ్తుంటాయి. ప్రధానంగా చిరుతలు రాత్రుల్లో ఎక్కువగా వేటాడుతాయి. హైవేపై వేగంగా వచ్చే వాహనాలు వీటిని ఢీకొంటున్నాయి. తాజాగా సదాశివనగర్ మండలం దగ్గి అటవీ ప్రాంతంలోని హైవేపై ఓ చిరుతను వాహనం ఢీకొట్టింది. దానికి తీవ్రగాయాలు కాగా అక్కడి నుంచి అడవిలోకి వెళ్లి పోయింది. అంతకు ముందు కూడా ఇదే ప్రాంతంలో చిరుతలు మృత్యువాత పడినట్లు అటవీ అధికారులు పేర్కొంటున్నారు. ఇందల్వాయి దగ్గర గతంలో రైల్వే ట్రాక్‌పై రైళ్లు ఢీకొని రెండు చిరుతలు మరణించాయి. వన్యప్రాణులు రోడ్లు, రైల్వేట్రాక్‌లు దాటకుండా ఉండాలంటే అండర్‌పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయడమే పరిష్కార మార్గమని అధికారులు చెబుతున్నారు. అలాగే అడవి ఎక్కడి వరకు ఉంటే అక్కడి వరకు రోడ్డుకు, రైల్వే ట్రాక్‌కు రెండు వైపులా ఫెన్సింగ్ వేస్తే కూడా జంతువులు బయటకు రాకుండా ఉంటాయని అంటున్నారు. ప్రమాదాల బారిన పడకుండా అండర్‌పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని, అప్పుడు వీటి కింది నుంచి వన్యప్రాణులు వెళ్తాయని చాలాసార్లు హైవే అథారిటీకి లేఖలు రాసినట్లు అటవీ శాఖ అధికారులు చెప్తున్నారు. వారు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఇటీవల కామారెడ్డి, నిజామాబాద్ అటవీ సరిహద్దులో హైవేపై ప్రమాదానికి గురైన చిరుత

లెక్కల్లేవ్!

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో రోడ్డు, రైలు ప్రమాదాల్లో ఇప్పటి వరకు ఎన్ని చిరుతలు, జంతువులు మృత్యువాత పడ్డాయో అటవీ శాఖ వద్ద సరైన వివరాలు లేనట్లు తెలుస్తోంది. మృతి చెందిన జంతువుల వివరాల కోసం 'సాక్షి' ప్రయత్నించగా సంబంధిత అటవీ శాఖ సెక్షన్ అధికారులు చెప్పలేకపోయారు. వివరణ కోసం రెండు జిల్లాల డీఎఫ్‌వోలకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

ఉమ్మడి జిల్లాలో అడవుల విస్తీర్ణం (హెక్టార్లలో)

కామారెడ్డి	82,190.48
నిజామాబాద్	86,871.45
ఇందల్వాయి రేంజ్	22,748.41
సిరికొండ రేంజ్	15,544.71

నాలుగుచోట్ల అండర్‌పాస్ బ్రిడ్జిలు అవసరం



జిల్లాలోనే అత్యధిక అడవులు, చిరుతలు ఉన్న రేంజ్ ఇందల్వాయి ఒక్కటే. కామారెడ్డి అడవులు దగ్గరగా ఉండడంతో చిరుతలు అటు ఇటు వెళ్తాయి. అడవుల మీదుగా ఉన్న రోడ్డును దాటే క్రమంలో ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి. ప్రమాదాలను నివారించడానికి సదాశివనగర్ నుంచి ఇందల్వాయి రేంజ్ వరకు రహదారిపై అండర్‌పాస్ బ్రిడ్జిలు నాలుగు చోట్ల ఏర్పాటు చేస్తే సరిపోతుంది. అడవికి రెండు వైపులా ఫెన్సింగ్ వేయాలని ఉన్నతాధికారులను కోరుతాం.
– రవిమోహన్ భట్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, ఇందల్వాయి

ఆస్పత్రి భవనం పై నుంచి దూకి రోగి ఆత్మహత్య

- అనారోగ్య సమస్యతో మనస్తాపానికి గురై అఘాయిత్యం



లక్ష్మణ్ (ఫైల్)

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆస్పత్రి భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన చాట్ల లక్ష్మణ్ (46) అనారోగ్యంతో ఈ నెల 7న ఆస్పత్రిలో చేరాడు. రెండో అంతస్తులో చికిత్స పొందుతున్న లక్ష్మణ్‌కు గుండె సమస్య తీవ్రం కావడంతో పాటు శరీరంలో వాపులు వచ్చాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో తన భార్య టీ తీసుకురావడానికి బయటకు వెళ్లగానే లక్ష్మణ్ ఆస్పత్రి 6 వ అంతస్తు పైకి ఎక్కి లోపలి కారిడార్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆస్పత్రి అధికారులకు సమాచారం అందించారు. 15 నిమిషాల్లోనే మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాగా లక్ష్మణ్ ఆత్మహత్యకు అనారోగ్యమే కారణమా! ఇంకేమైన కారణాలు ఉన్నాయో అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రిలో 200 పైగా సీసీ కెమెరాలు, పోలీసులు, ప్రతి ఫ్లోర్‌లో సరిపడా సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా ఆత్మహత్య ఘటన జరగడం పై చర్చనీయాంశమైంది.

గవర్నర్‌ను కలిసిన గడుగు



రాష్ట్ర గవర్నర్‌తో కరచాలనం చేస్తున్న గడుగు

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మంగళవారం వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు కలిశారు. ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ తదితరులు ఉన్నారు. అనంతరం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గడుగు గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి గడుగును శాలువాతో సత్కరించారు.

ముసాయిదాపై అభ్యంతరాలుంటే తెలపండి

- రాజకీయ పార్టీలను కోరిన అదనపు కలెక్టర్ అంకిత్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12 లోపు తెలియజేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ రాజకీయ పార్టీలను కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్లో మంగళవారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో ముసా యిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఈనెల 7న జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో ముసా యిదా జాబితాను ప్రకటించామన్నారు. జిల్లాలో మొత్తం 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డులు ఉండగా, రాష్ట ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ 5053 పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ ముసాయిదా జాబితాను రూపొందించామని వివరించారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో 180 జీపీలు, 1766 వార్డులకు గాను 1786 పోలింగ్ కేంద్రాలు, బోధన్ డివిజన్ పరిధిలో 152 జీపీలు, 1354 వార్డు లకు గాను 1354 పోలింగ్ కేంద్రాలు, నిజామాబాద్ డివిజన్ పరిధిలో 213 జీపీలు, 1902 వార్డులకు గాను 1913 పోలింగ్ కేంద్రాలను ముసాయిదా జాబితాలో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ నెల 12న అన్ని మండలాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవోలు నిర్వహించే సమావేశంలోనూ అభ్యంతరాలు స్వీకరిస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను 13న పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17న అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువత సామర్థ్యాల పెంపుపై దృష్టి

- స్వచ్ఛంద సంస్థతో తెయూ ఒప్పందం
- వెల్లడించిన వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్, యూడబ్ల్యూహెచ్ సభ్యులు

తెయూ(డిచ్‌పల్లి): విద్య, నైపుణ్యం, జీవనోపాధి, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాలలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మద్దతు నిచ్చేందుకు లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ (యూడబ్ల్యూహెచ్) సంస్థ తో తెలంగాణ యూనివర్సిటీ ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ మేరకు మంగళవారం తెయూ వీసీ ప్రొఫెసర్ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి, యూడబ్ల్యూహెచ్ టీమ్ సభ్యులు మెరుగు భరత్, సీనియర్ అసోసియేట్ మాదిరెడ్డి సౌమ్య ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ పెద్ద స్థాయి కమ్యూనిటీ ఆధారిత ప్రాజెక్టులను రూపొందించడానికి, అమలు చేయడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. ఈ ఎంవోయూ వల్ల వర్సిటీ లో యువతకు అవసరమైన పని సంబంధిత సామర్థ్యాలను పెంపొందించడంపై దృష్టి సారించి ఉపాధి మెరుగుదల కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు.

ఎంవోయూతో యువతకు వివిధ రాష్ట్రాలలో జాబ్ రెడీనెస్ ట్రైనింగ్ (సాఫ్ట్ స్కిల్స్), టెక్నికల్ ట్రైనింగ్స్ చేరువవుతాయన్నారు. ప్రధానంగా యూడబ్ల్యూహెచ్ తెయూ క్యాంపస్‌లో అర్హులైన మహిళలందరికీ మూడు నెలలు సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ ఇస్తుందన్నారు. యూడబ్ల్యూహెచ్ ద్వారా క్యాంపస్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రాజెక్టులను సులభతరం చేయడం కోసం అధ్యాపకులు మామిడాల ప్రవీణ్ చేస్తున్న కృషిని వీసీ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, అధ్యాపకులు భ్రమరాంభిక, నందిని, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్పకు దాతలే దిక్కు !

- క్రీడా పోటీలకు విడుదల కాని ప్రభుత్వ నిధులు
- బహుమతుల కోసం దాతల సహకారం కోరుతున్న అధికారులు
- స్పందన రానిపక్షంలో విజేతలను ప్రకటించడం తప్ప, బహుమతులు ఇచ్చే పరిస్థితి లేని వైనం
- స్థానిక సంస్థలకు క్రీడా మైదానాలను బాగు చేసే బాధ్యత
- ప్రహసనంగా క్రీడా పోటీల నిర్వహణ



భీమ్‌గల్‌లో సీఎం కప్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, క్రీడాకారులు

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను అట్టహాసంగా ప్రారంభించినా వీటి నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడంతో అధికార యంత్రాంగం దాతల సహకారం కోరాల్సి వస్తోంది. మొదట గ్రామ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించగా మంగళవారం నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయిలో పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల ముగింపు తరువాత జిల్లా స్థాయిలోను ఆ తరువాత రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహించనున్నారు. గ్రామ, మండల స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు నిధులు భారీ మొత్తంలోనే అవసరం ఉన్నా ప్రభుత్వం నిధుల కేటాయింపుపై ప్రకటనకే పరిమితమైంది. నిధులు మాత్రం విడుదల చేయలేదు. గ్రామ స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మైదానం సిద్ధం చేయడం, ఇతర ఖర్చులను గ్రామ పంచాయతీలే భరించాయి. విజేతలకు బహుమతులు ఇవ్వాలని మార్గదర్శకాలలో ప్రభుత్వం సూచించినా నిధులు లేకపోవడంతో బహుమతుల పంపిణీ సాధ్యం కాలేదు. మండల స్థాయిలో క్రీడల నిర్వహణ, బహుమతుల కోసం అధికారులు దాతల సహకారం కోరారు. కొన్ని చోట్ల దాతలు స్పందించి బహుమతులను వితరణ చేయగా వాటిని క్రీడా పోటీల ముగింపు రోజున అందచేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చాలా మండలాల్లో దాతలు ఎవరూ ముందుకు రాకపోవడంతో అధికారులు బహుమతుల పంపిణీపై మౌనం వహిస్తున్నారు. క్రీడా పోటీలను నిర్వహించి విజేతల జాబితాను విడుదల చేయడం మినహా మరో ప్రయత్నం ఏది చేయడం లేదు. ఆరు రకాల క్రీడా పోటీల నిర్వహణ, విజేతలుగా నిలిచినవారికి బహుమతుల పంపిణీ కోసం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుంది. దాతలు ఇద్దరు ముగ్గురు కలిసి విరాళం ఇచ్చిన చోట బహుమతులను కొనుగోలు చేశారు. క్రీడా మైదానాల నిర్వహణ భారాన్ని మాత్రం అక్కడి పంచాయతీలపై మోపారు. ప్రభుత్వం స్పందించి క్రీడా పోటీల నిర్వహణకు నిధులను సకాలంలో విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

నిధులు రాలేదు..

దాతలు సహకరించడంతో విజేతలైన వారికి బహుమతులు కొనుగోలు చేశాం. ప్రభుత్వం నిధులు కేటాయిస్తామని ప్రకటించింది. ఇంకా నిధులు మావరకు అందలేదు. దాతలు, స్థానిక సంస్థల సహకారంతో గ్రామ, మండల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నాం. – తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

బాల సాహిత్యంతో సంస్కృతి, సంప్రదాయాలు



ప్రశంస పత్రాలను అందజేస్తున్న డీఈవో



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్
- బాల భవన్‌లో బాలసాహిత్య వేదిక ఆధ్వర్యంలో కార్యశాల

నిజామాబాద్ రూరల్ : బాల సాహిత్యంతో సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షింపబడతాయని జిల్లా విద్యాధికారి అశోక్ పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని బాల్‌భవన్‌లో మంగళవారం బాలసాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కథా, కవితా కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల సాహిత్యంతో పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని, బాలసాహిత్య పోటీలు పెట్టి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన బాలసాహిత్య వేదిక అధ్యక్షులు డాక్టర్ కాసర్ల, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ శర్మ, కార్యవర్గ సభ్యులు డాక్టర్ శారద, డాక్టర్ శ్రీమన్నారాయణ చార్య, తంగుడిగి శ్రీనివాస్, కందకుర్తి ఆనంద్, వసంత లక్ష్మణ్‌లను డీఈవో అభినందించారు. అనంతరం ప్రముఖ బాలసాహితీవేత్త తల్లావజ్జల మహేష్ బాబు రచించిన జయ జగదీశ శతకాన్ని డీఈవో ఆవిష్కరించారు. అంతకుముందు కథా రచనలో మెలకువలు అంశం పై ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ వి ఆర్ శర్మ ప్రసంగించారు. బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో కవితలను రాసి తమల్ని తాము మెరుగుపరుచుకోవాలన్నారు. బాలసాహిత్యంలో జిల్లా నుంచి ఇటీవల కాలంలో సుమారు 30 పుస్తకాలు వచ్చాయన్నారు. పోటీల్లో గెలుపొందిన 150 మంది విద్యార్థులకు డీఈవో బహుమతులను అందజేశారు. సాహిత్య అభిమానులు, బాల సాహిత్య వేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు బేస్‌బాల్‌ జట్టు ఎంపిక

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బేస్‌బాల్‌ జిల్లా సీనియర్‌ పురుషుల జట్టును బుధవారం ఎంపిక చేయనున్నట్లు జిల్లా బేస్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌ రెడ్డి, సొప్పరి వినోద్‌ మంగళవారం తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు మధ్యాహ్నం 3గంటలకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మల్లేశ్‌గౌడ్‌, అకాడమీ కోచ్‌ నరేశ్‌ను సంప్రదించాలని సూచించారు.

నిత్యావసరాల సంచి అప్పగింత



ఖలీల్‌వాడి: రోడ్డుపై పడిపోయిన నిత్యావసరాల సంచిని బాధితుడికి అప్పగించినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ మంగళవారం తెలిపారు. ఈ నెల 7న మధ్యాహ్నం 12 గంటల సమయంలో నగరంలోని కోర్టు చౌరస్తాలో ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా రూ.2వేల విలువైన నిత్యావసరాల సంచి పడిపోయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్‌ సిబ్బంది గమనించి తీసి పక్కన పెట్టారు. బిల్లు ఆధారంగా అడ్రస్‌ గుర్తించి నిత్యావసరాలను తిరిగి సదరు వ్యక్తికి అందజేశారు.

‘స్వధార్‌ హోం’పై ఇంటెలిజెన్స్‌ ఆరా?

సాక్షి ఎఫెక్ట్‌..

నిజామాబాద్‌నాగారం: ఆపదలో ఉన్న మహిళలకు ఆశ్రయం కల్పించాల్సిన స్వధార్‌ హోమ్‌ వివాదాలకు కేంద్రమైన వైనంపై ‘రచ్చకెక్కిన స్వధార్‌ హోమ్‌’ శీర్షికన ఈనెల 9న ‘సాక్షి’లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్‌ వర్గాలు ‘స్వధార్‌ హోమ్‌’ కార్యకలాపాలు, అక్కడి పరిస్థితిపై ఆరా తీశారు. స్వయంగా కార్యాలయంలోకి వెళ్లి ఉద్యోగులతో మాట్లాడి బాధితులను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారనే కోణంలో ఆరా తీసినట్లు తెలిసింది.

కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నాలు

సంక్షేమ శాఖ అధికారులు స్వధార్‌హోమ్‌ బాధితులతో వ్యవహరించిన తీరును కప్పిపుచ్చేందుకు శాఖలోని కిందిస్థాయి ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నించిన్నట్లు తెలిసింది. మొదట్లో చలో కలెక్టరేట్‌ కార్యక్రమం చేపట్టి నిరసన, ధర్నా చేయడానికి ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అధికారుల తప్పు లేదని కప్పిపుచ్చేందుకు నానా తంటాలు పడుతున్నట్లు సమాచారం. మళ్లీ పరిస్థితి చేయి దాటి పోయే పరిస్థితి ఉందని తోటి ఉద్యోగుల్లోని సీనియర్లు హెచ్చరించడంతో మౌనంగా ఉండిపోయినట్లు తెలిసింది.

లంచం ఇవ్వొద్దు.. ఏసీబీకి సమాచారమివ్వండి

- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాదిలో 10 కేసులు నమోదు
- పాత కేసుల్లో ఇద్దరికి శిక్ష ఖరారు
- ఈనెల 3 నుంచి 9వరకు కొనసాగిన ఏసీబీ వారోత్సవాలు

ఖలీల్‌వాడి: ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుని తమ విధుల్లో లంచాన్ని భాగం చేసుకున్న ప్రభుత్వ అధికారుల పని పడుతోంది అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ). లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని స్పష్టం చేస్తున్న ఏసీబీ.. అధికారులు ఎవరైనా లంచం అడిగితే తమకు సమాచారం అందించాలని విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది.

అవినీతి అధికారుల ఆట కట్టించడమే లక్ష్యంగా ఏసీబీ పని చేస్తోంది. ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిరోధక వారోత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో ఈ ఏడాది 10 కేసులు నమోదైనట్లు ఏసీబీ అధికారులు చెబుతున్నారు.



ఉమ్మడి నిజామాబాద్‌ ఏసీబీ ఆఫీస్‌

తీరు మార్చుకోని అధికారులు

ఓ వైపు లంచం డిమాండ్‌ చేసి అధికారులు ఏసీబీకి పట్టుబడుతున్నా మరో వైపు కొంత మంది అధికారులు తమ తీరును మార్చుకోవడం లేదు. తమ ముందుకు వచ్చిన ఫైళ్లను వెంటవెంటనే క్లియర్‌ చేయాల్సిన బాధ్యతను పక్కనపెట్టి చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. రాజకీయ నాయకులు తమ పనులను పలుకుబడితో పూర్తి చేయించుకుంటే, సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. దీంతో కొంత మంది బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గత రెండేళ్లతో పోలిస్తే ప్రస్తుతం కేసుల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా విద్య, వైద్యం, రెవెన్యూ, మున్సిపల్‌, రవాణ, ట్రెజరీ, రిజిస్ట్రేషన్‌, పంచాయతీరాజ్‌, ఇంజినీరింగ్‌, జెడ్పీ, అగ్నిమాపక, ఎక్సైజ్‌, అటవీ, పోలీసు, వ్యవసాయశాఖ ఇలా పలు శాఖల్లో కొంత మంది కారణంగా అవినీతి రాజ్యమేలుతోంది.

మూడేళ్లలో కేసులు..	
2022	7
2023	7
2024	10
(డిసెంబర్‌ 1 వరకు)	

ఫిర్యాదు చేయొచ్చు ఇలా..

ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది లంచం అడిగితే టోల్‌ ఫ్రీ నంబర్‌ 1064కి సమాచారం అందించాలి. ఏసీబీ కార్యాలయంలో నేరుగా సంప్రదించే అవకాశమూ ఉంది. ఫిర్యాదారుల వివరాలను ఏసీబీ అధికారులు గోప్యంగా ఉంచుతారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే దాడులు నిర్వహిస్తారు.

ఏసీబీ అధికారుల ఫోన్‌ నంబర్లు :
శేఖర్‌గౌడ్‌, డీఎస్పీ – 91543 88950, నగేశ్‌, సీఐ – 91543 88951, శ్రీనివాస్‌, సీఐ – 91543 88953, వేణుకుమార్‌, సీఐ – 91548 88928.

ఆఫీస్‌ అడ్రస్‌:
ఏసీబీ కార్యాలయం, కంఠేశ్వర్‌ ఏరియా, అయ్యప్పస్వామి గుడి దగ్గర.

ఈ ఏడాది నమోదైన కేసులు

- కామారెడ్డి సబ్‌స్టేషన్‌లో అద్దె ప్రాతిపదికన వాహనాన్ని తీసుకునేందుకు సంతోష్‌ అనే వ్యక్తి నుంచి ఏఈ సాయిని రాజు రూ.12,500 లంచం డిమాండ్‌ చేశాడు. లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డాడు.
- జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన గ్రామ పంచాయితీ కార్యదర్శి మనోహర్‌ ఓనర్‌ సర్టిఫికేట్‌ కోసం రూ.4 వేలు డిమాండ్‌ చేయడంతో నిఖిల్‌ అనే వ్యక్తి ఏసీబీని ఆశ్రయించగా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- కమ్మర్‌పల్లి మండల పరిషత్‌ కార్యాలయంలో రావుట్ల బాగయ్య ఎస్‌ఆర్‌ బుక్‌ను సెట్‌ చేయడానికి ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, సీనియర్‌ అసిస్టెంట్‌ హరిబాబు రూ.8 వేలు డిమాండ్‌ చేసి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- ఆర్మూర్‌ కోర్టులో సిబ్బంది డబ్బులు ఇవ్వాలని డిమాండ్‌ చేయడంతో బాధితుడు వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.
- నందిపేట్‌లో ఇంటి నిర్మాణ అనుమతి ఇచ్చేందుకు ఆటో డ్రైవర్‌ సంతోష్‌ నుంచి సెక్రెటరీ నవీన్‌కుమార్‌ రూ.8వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- వర్ని ఎస్సై కృష్ణ స్టేషన్‌ బెయిల్‌ కోసం రూ.20 వేలు డిమాండ్‌ చేయడంతో బాధితుడు నాగరాజు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాగరాజు నుంచి ఎస్సై కృష్ణ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.
- లింగంపేట్‌ ఎస్సై అరుణ్‌, కానిస్టేబుల్‌ రామస్వామి స్టేషన్‌ బెయిల్‌ ఇచ్చేందుకు శివలింగం అనే వ్యక్తి నుంచి రూ.10 వేలు డిమాండ్‌ చేశారు. శివలింగం ఏసీబీని ఆశ్రయించడంతో ఎస్సై, కానిస్టేబుల్‌ను పట్టుకున్నారు.
- బోధన్‌ మండలంలోని సాలూరా చెక్‌ పోస్టు వద్ద ఏసీబీ తనిఖీలు చేసి కేసు నమోదు చేశారు.
- నిజామాబాద్‌ నగరంలోని కోటగల్లీలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేశారు.
- నిజామాబాద్‌ నగరంలోని మున్సిపల్‌ కార్పొరేషన్‌ రెవెన్యూ ఉద్యోగి నరేందర్‌ ఇంటిలో రూ.2.93 కోట్లు పట్టుబడగా, ఆయనపై కేసు నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో రెండు కేసుల్లో శిక్ష

- 2008లో మాక్లూర్‌లో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ కోసం ఏఈ సదాశివ్‌ రూ.3 వేలు డిమాండ్‌ చేయడంతో శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తిని ఏసీబీని ఆశ్రయించారు. ఈ కేసులో నాంపల్లి కోర్టు నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధించింది.
- 2012లో నగరంలోని మున్సిపల్‌ కార్పొరేషన్‌లో సీసీ రోడ్డు పనుల ఎస్టిమేషన్‌కు బండారి అర్వింద్‌ అనే వ్యక్తిని ఏఈ అశోక్‌ రూ.20 వేలు డిమాండ్‌ చేశారు. అర్వింద్‌ ఏసీబీని ఆశ్రయించగా ఏఈని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు ఏఈకి రెండేళ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధించింది.

లంచం ఇవ్వొద్దు

ఎవరూ లంచం ఇవ్వవద్దు. అధికారులు ఎవరైనా లంచం అడిగితే టోల్‌ ఫ్రీ నంబర్‌ 1064 లేదా ఏసీబీ అధికారులకు ఫోన్‌లో సమాచారం అందించాలి. నేరుగా ఏసీబీ కార్యాలయంలోనూ సంప్రదించొచ్చు. ప్రజల్లో చైతన్యం వస్తోంది. అధికారులు ఎలాంటి ఇబ్బందులకు లోనుకాకుండా ప్రజలకు పనులు చేయాలి.

– శేఖర్‌గౌడ్‌, ఏసీబీ డీఎస్పీ, నిజామాబాద్‌

లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి





నిజామాబాద్‌ అర్బన్‌: విద్యార్థినులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకుని లక్ష్య సాధన దిశగా విద్యాభ్యాసాన్ని సాగించాలని నిజామాబాద్‌ జిల్లా కోర్టు ప్రిన్సిపల్‌ సెషన్స్‌ జడ్జి సునీత కుంచాల అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నిజామాబాద్‌ నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాలలో జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపల్‌ బుద్ధిరాజు అధ్యక్షత వహించగా, అతిథిగా జిల్లా ఇంటర్‌ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్‌ హాజరయ్యారు. ప్రతి మహిళా తమ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడం విద్యార్థి దశనుంచే అలవర్చుకోవాల్సి ఉంటుందని న్యాయమూర్తి అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే హక్కులను తెలుసుకోవాలని, అన్ని విషయాల్లో జిల్లా న్యాయ సేవా సంస్థ మహిళలకు హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తుందన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

నిజామాబాద్‌రూరల్‌: రూరల్‌ పీఎస్‌ పరిధిలోని గంగాస్థాన్‌ ఫేజ్‌–1 వద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఘటనలో మంగళవారం రాత్రి నలుగురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆటోడ్రైవర్‌ నిజామాబాద్‌ నుంచి ముబారక్‌ నగర్‌ వెళ్లుతున్నట్లు వివరించారు. గాయపడ్డ వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో ఆరిఫ్‌ను వివరణ కోరగా తమకు సమాచారం అందలేదని తెలిపారు.

ఇద్దరిపై దాడి

నిజామాబాద్‌రూరల్‌: నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై దాడి జరిగినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఎండీ ఆరిఫ్‌ తెలిపారు. దుబ్బ ప్రాంతానికి చెందిన పంచరెడ్డి నవీన్‌ స్నేహితుడితో కలిసి సోమవారం రాత్రి శుభకార్యం నిమిత్తం కాలూర్‌ గ్రామానికి వెళ్లి వస్తుండగా ఖానాపూర్‌ శివారులో దుండగులు వీరిపై కర్రలతో దాడి చేశారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మానవ హక్కులతోనే శాంతి, సమానత్వం



మాట్లాడుతున్న డాక్టర్‌ జెట్లింగ్‌ ఎల్లోసా

తెయూ(డిచ్‌పల్లి): ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, ప్రజాస్వామ్య దేశాల్లో కూడా జాతి, మత, లింగ వివక్ష అధికంగా ఉండడం విచారకరమని తెలంగాణ యూనివర్సిటీ లా అధ్యాపకుడు డాక్టర్‌ జెట్లింగ్‌ ఎల్లోసా పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణతోనే శాంతి, సమానత్వం సాధ్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్‌ 1వ, 4వ యూనిట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన జెట్లింగ్‌ ఎల్లోసా ‘మానవ హక్కులు – మన భవిష్యత్‌’ అనే అంశంపై ప్రసంగించారు. ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు మరింతగా దిగజారుతున్నాయన్నారు. పాలకులు మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపల్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆరతి, లా కాలేజీ ప్రిన్సిపాల్‌ కే ప్రసన్నరాణి, ఎన్‌ఎస్‌ఎస్‌ కో ఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ కే రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు స్వప్న, ప్రవంతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించాలి



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న భుజంగం



పాల్గొన్న తెయూ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ ఆరతి, అధ్యాపకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థుల జీవితంలో సమయం చాలా ముఖ్యమైనదని, సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వాళ్లే విజేతలుగా నిలబడతారని రిటైర్డ్‌ లెక్చరర్‌ ఏ భుజంగం పేర్కొన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు చదువుతోపాటు పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించాలని ఆయన సూచించారు. తెలంగాణ యూనివర్సిటీలో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆరతి అధ్యక్షతన మంగళవారం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భుజంగం మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని వర్సిటీలోని వనరులను వినియోగించుకొని అత్యుత్తమంగా ఎదగాలన్నారు. సహజంగా ప్రతి విద్యార్థికి తెలివితేటలు ఉంటాయని, వాటిని బాధ్యతగా ఉపయోగించుకున్న వాళ్లే జీవితంలో స్థిరపడతారని అన్నారు. అనంతరం భుజంగంను ఘనంగా సన్మానించారు. ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌, యూజీసీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆంజనేయులు, ఎన్‌ఎస్‌ఎస్‌ కో ఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ కే రవీందర్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

పరిస్థితి విషమించి మృతి

- తండ్రి భూమి పంచివ్వడంలేదని పురుగుల మందు తాగిన కొడుకు
- ఆస్పత్రిలో మృతి



బుయ్య పెంటయ్య మృతదేహం

లింగంపేట(ఎల్లారెడ్డి): తండ్రి భూమి పంచివ్వడం లేదని మండలంలోని మోతె గ్రామానికి చెందిన బుయ్య పెంటయ్య(37) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భూమిని కౌలుకు ఇవ్వడం లేదని, అలాగే తనకు వాటాగా రావాల్సిన భూమిని పంచివ్వడం లేదని తండ్రి రాములుకు పెంటయ్యకు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పెంటయ్య మనస్తాపానికి గురై ఈ నెల 2వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య రమాలీల, ఇద్దరు పిల్లలు ఉన్నారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి): అంత్యక్రియలకు వెళ్తుండగా చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోతె గ్రామానికి చెందిన బుయ్య కుర్మ పెంటయ్య అంత్యక్రియలకు హాజరయ్యేఏందుకు గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామానికి చెందిన పలువురు ట్రాలీ ఆటోలో వెళ్తుండగా టైర్‌ పేలి ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న చందం శ్యామల, చాకలి లక్ష్మవ్వ, లంక లక్ష్మి, మొగుళ్ల శ్యామల, సురేశ్‌, శెట్కూరి శ్యామల, మంజుల, భైరవ్వ, కాశీరాం, విఠవ్వతోపాటు మరి కొంత మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పోచమ్మగల్లీలో ప్రవంతి(32) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. పోచమ్మగల్లీకి చెందిన మేఘరాజ్‌తో ప్రవంతికి మూడేళ్ల క్రితం వివాహమైందని, వారికి ఒక పాప ఉందని తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కల్కినగర్‌కు చెందిన ఆంజనేయులు(42) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పెద్ద చెరువులో పడి మృతి చెందాడు. రేడియం దుకాణంలో పని చేసే ఆంజనేయులు సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం శవమై తేలాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

పైడిమల్‌కు చెందిన వ్యక్తి..

వర్ని: మండలంలోని పైడిమల్‌ గ్రామానికి చెందిన మాల రాములు(38) ప్రమాదవశాత్తు సైదిపూర్‌ ఊర చెరువులో పడి మంగళవారం మృతి చెందినట్లు వర్ని ఎస్సై రమేశ్‌ తెలిపారు. చెరువులో దిగిన పశువులను బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న రాములు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడన్నారు. మృతుని తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిజాంసాగర్‌ ప్రాజెక్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



నిజాంసాగర్‌(జుక్కల్‌): నిజాంసాగర్‌ ప్రాజెక్టు గేట్ల వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని ఎస్సై శివకుమార్‌ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, కుడి చేతిపై టాటూ ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్‌హెచ్‌వో 87126 86172 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఇరువర్గాలపై కేసు

నవీపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం రాత్రి మండల కేంద్రంలో జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌ మంగళవారం తెలిపారు. కానిస్టేబుల్‌ యాదగిరి కుటుంబంలో గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సోమవారం రాత్రి యాదగిరి ఇంటికి ఆయన చెల్లెలు భర్త రమేశ్‌, అల్లుడు గంగాధర్‌ వచ్చారన్నారు. వారితో కలిసి యాదగిరి తన భార్య ఇందిర, కొడుకు అరవింద్‌తో ఘర్షణకు దిగాడు. అరవింద్‌పై పదునైన ఆయుధంతో వారు దాడి చేశారన్నారు. ఇందిర ఫిర్యాదు మేరకు యాదగిరి, రమేశ్‌, గంగాధర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అలాగే యాదగిరిపై దాడికి పాల్పడిన భార్య ఇందిర, కొడుకు అరవింద్‌తోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోపాల్‌ పోలీస్‌ స్టేషన్‌ తనిఖీ



నిజామాబాద్‌ రూరల్‌: మోపాల్‌ పోలీస్‌ స్టేషన్‌ను ఏసీపీ రాజావెంకటరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను, సిబ్బంది పరేడ్‌ డ్రిల్‌, కిట్టు లను పరిశీలించారు. అనంతరం పెట్రోలింగ్‌, బీట్‌ తదితర వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. పెట్రోలింగ్‌ చేయాలని, సైబర్‌ నేరాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. సీఐ సురేశ్‌కుమార్‌, ఎస్సై యాదగిరి గౌడ్‌, ఏఎస్సై దయాల్‌సింగ్‌, రమేశ్‌, సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత



రుద్రూర్‌: పొతంగల్‌ మండలం కోడిచర్ల శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌ స్టేషన్‌కు తరలించి మైనింగ్‌ అధికారులకు సమాచారం అందించామన్నారు. పోలీస్‌, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నప్పటికీ ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. మంజీరా నది సమీపంలో, గుట్ట ప్రాంతాల్లో అక్రమార్కులు ఇసుక డంప్‌ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

వేర్వేరు చోట్ల రెండు లారీలు బోల్తా



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్‌ మూలమలుపు వద్ద మంగళవారం మక్కల లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఔరంగాబాద్‌ నుంచి కామారెడ్డి వైపు మక్కలలోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. అలాగే లింగంపేట వైపు నుంచి ఎల్లారెడ్డి వైపు బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ మెంగారం గ్రామ శివారులోని మిద్దెమిట్టు వద్ద బోల్తాపడింది.

అంతర్‌జిల్లా టోర్నీ అంపైర్‌గా నడ్కుడ వాసి



వేల్పూర్‌ : వేల్పూర్‌ మండలం పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన అశిల అనిల్‌ అంతర్‌జిల్లా మహిళా కబడ్డీ టోర్నమెంట్‌కు టెక్నికల్‌ అంపైర్‌గా వ్యవహరించారు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన అంతర్‌ జిల్లా మహిళా కబడ్డీ టోర్నీకి అంపైర్‌గా వ్యవహరించినట్లు కిసాన్‌ కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కర్‌ గంగాధర్‌ తెలిపారు. అంపైర్‌గా వ్యవహరించిన అనిల్‌ను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ సుంకెట అన్వేష్‌రెడ్డి అభినందించారు.



జాతీయస్థాయి యోగాసన పోటీలకు..

నిజామాబాద్‌నాగారం: ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో కొనసాగనున్న జాతీయస్థాయి యోగాసన పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులు మంగళవారం బయల్దేరి వెళ్లారు. అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి కృపాకర్‌, జాయింట్‌ సెక్రెటరీ రామ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామ్‌చందర్‌, కార్యదర్శి బాలశేఖర్‌, జాయింట్‌ కార్యదర్శి సంగీత క్రీడాకారులను అభినందించారు. పద్మ, సుజాత, ప్రియాంక, రసజ్ఞ, ప్రియాంక, మంజుల, రవళి, రిత్విక జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

గోదావరిలో దూకి ఆత్మహత్య



సంతోష్‌గౌడ్‌(ఫైల్‌)

నవీపేట: మండలంలోని యంచ శివారులోని గోదావరిలో దూకి ఫకీరాబాద్‌ గ్రామానికి చెందిన కొండా సంతోష్‌గౌడ్‌ (40) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు. గత ఎనిమిది నెలలుగా గుర్తు తెలియని మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న సంతోష్‌గౌడ్‌ మానసిక ఆందోళనకు గురయ్యాడని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం గోదావరిలో దూకేందుకు వెళ్లగా యంచ గ్రామస్తులు కాపాడారని పేర్కొన్నారు. మంగళవారం కల్లు దుకాణం తెరిచిన తరువాత గోదావరి నది వైపు స్కూటీపై వెళ్లిన సంతోష్‌గౌడ్‌ తన స్నేహితుడికి ఫోన్‌ చేసి గోదావరి దూకుతున్నట్లు తెలిపా డు.మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు..

కామారెడ్డి క్రైం: అనారోగ్య కారణాలతో ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని రాజీవ్‌నగర్‌ కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.

కాలనీకి చెందిన కెంగర్ల మల్లయ్య (70) గత ఐదేళ్లుగా బీపీ, షుగర్‌, ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, జీవితంపై విరక్తి చెందిన మల్లయ్య సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.